తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం - 23- ఏప్రిల్ 2026 | సంపుటి : 3 | సంచిక : 325 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# ఆర్టీసీ సమ్మె విరమించాలి



2లో

- ఉద్యోగులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి
- సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీ.. నాలుగు వారాల్లో నివేదిక
- 32 డిమాండ్లలో 29 అంశాల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం
- ప్రజా రవాణాకు ఆటంకం కలిగించవద్దని కార్మికులకు బహిరంగ లేఖ

## హైదరాబాద్ నుంచి 8 కొత్త వీక్లీ స్పెషల్ రైళ్లు

- ప్రయాణికుల సౌకర్యానికి కేంద్రం కీలక నిర్ణయం
- పలు ప్రధాన నగరాలకు కొత్త కనెక్టివిటీ
- మే నుంచి దశలవారీగా ప్రారంభం

2లో





## వంతెనలకు అప్రోచ్ రోడ్లపై ప్రభుత్వం దృష్టి

- రూ.148 కోట్లకు ఆమోదం
- క్యాబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయాలు
- మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న వంతెనలు
- పనులు వేగవంతం చేయాలని భట్టి ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ మరియు క్యాపిటల్ వర్క్స్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షత వహించగా, మంత్రులు కోమటిరెడ్డి మిగతా 2లో

# కాళేశ్వరం నివేదికపై స్టే

- మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో ఊరట
- ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం
- విచారణలో సరైన ప్రక్రియ పాటించలేదని ధర్మాసనం స్పష్టీకరణ
- సెక్షన్ 8బీ, 8సీ కింద నోటీసులు ఇవ్వలేదన్న పిటిషనర్ల వాదనతో ఏకీభావం

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఈ నివేదికను ఆధారంగా చేసుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావుతో పాటు మరో ఇద్దరు ఉన్నతాధికారులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణ కమిషన్ చట్టం కింద మిగతా 2లో



### కాళేశ్వరం నివేదికపై స్టే... అవినీతి అంశం మాత్రం మిగిలిందే : మహేశ్ గౌడ్

- హైకోర్టు తీర్పుపై టీపీసీసీ స్పందన
- సాంకేతిక కారణాలకే పరిమితమని స్పష్టం
- సీబీఐ విచారణపై బీజేపీపై ప్రశ్నలు

## 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టిన జూపల్లి


- ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్
- 250 మందితో విజ్ఞాన యాత్ర
- వారసత్వం, ఆధునికతకు వారధి

**ఉట్నూరు, ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతూ 'రివర్స్ టూరిజం' అనే వినూత్న భావనకు మంత్రి జూపల్లి కృష్ణారావు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండుగూడలో ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. సాధారణంగా నగర వాసులు అడవులను సందర్శించడం పర్యాటకంలో భాగమని, కానీ అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు నగర అభివృద్ధి, చారిత్రక వారసత్వం, ఆధునిక జీవనశైలిపై అవగాహన కల్పించడమే మిగతా 2లో




# ప్రేమ పేరుతో మోసం

- కిలో బంగారం కాజేసిన మేనేజర్ అరెస్ట్
- బ్రెయిన్ ట్యూమర్ నాటకంతో మోసం
- యజమాని కుమార్తెను వంచించిన నిందితుడు
- పోలీసుల అదుపులో సాగర్ – దర్యాప్తు కొనసాగింపు



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** నమ్మకంగా పనిచేస్తున్నాడనుకున్న వ్యక్తే యజమాని కుటుంబానికి తీరని ద్రోహం చేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనలో ప్రేమ పేరుతో యజమాని కుమార్తెను మోసం చేసి కిలో బంగారు ఆభరణాలను కాజేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుజరాత్‌కు చెందిన ఓ వ్యాపారి చైతన్యపురిలో టైల్స్ వ్యాపారం నిర్వహిస్తుండగా, 34 ఏళ్ల సాగర్ అనే వ్యక్తి గత నాలుగేళ్లుగా మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. నమ్మకంగా ఉంటూ యజమాని కుటుంబంతో సన్నిహితంగా మారిన అతడు, యజమాని కుమార్తెతో పరిచయం పెంచుకుని ప్రేమ పేరుతో ఆమెను తనవైపు తిప్పుకున్నాడు. మిగతా 5లో




# శంషాబాద్‌లో హైడ్రా మెరుపు దాడి

- 9 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- రూ. 90 కోట్ల విలువైన భూమికి హైడ్రా ఫెన్సింగ్
- కోర్టు స్టే ఉత్తర్వులను ధిక్కరించి అక్రమ లేఅవుట్ నిర్మాణం
- ఫిర్యాదుతో రంగంలోకి దిగి ఆక్రమణలు తొలగించిన అధికారులు

**శంషాబాద్, ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో భారీ భూ ఆక్రమణను హైడ్రా అధికారులు బుధవారం విజయవంతంగా అడ్డుకున్నారు. సుమారు 9.05 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల చెర నుండి విడిపించి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ. 90 కోట్లకు పైగా ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వే నంబర్ 626/2లో ఉన్న మొత్తం 176.05 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వానిదేనని స్పష్టమవుతోంది. ఇందులో 166 ఎకరాలను అటవీ అభివృద్ధి సంస్థకు కేటాయించగా, మిగిలిన 9.05 ఎకరాల భూమిపై కొందరు వ్యక్తులు నిజాం కాలం నాటి హక్కులను క్లెయిమ్ చేస్తూ వివాదం సృష్టించారు.

ప్రస్తుతం ఈ భూమికి సంబంధించిన వివాదం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. కేసు తేలే వరకు భూమి స్వభావాన్ని మార్చకూడదని, ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని న్యాయస్థానం స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తజమ్ముల్ మొయినుద్దీన్ ఖాన్ అనే వ్యక్తి మిగతా 5లో



## ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డీజీ పదోన్నతులు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- పోలీస్ విభాగంలో కీలక మార్పులు
- అనుభవజ్ఞులకు ఉన్నత హోదాలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణలో పోలీసు శాఖలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డైరెక్టర్ జనరల్ (డీజీ) హోదాకు పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
పదోన్నతి పొందిన వారిలో మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు, చారు సిన్హా, అనిల్ కుమార్, వీసీ సజ్జనార్ ఉన్నారు. ప్రస్తుతం మహేశ్ భగవత్ లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా బాధ్యతలు నిర్వహిస్తుండగా, స్వాతి లక్రా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా ఉన్నారు. వీవీ శ్రీనివాసరావు తెలంగాణ పోలీస్ నియామక మండలి చైర్మన్‌గా పనిచేస్తున్నారు. అలాగే చారు సిన్హా సీఐడీ, మహిళా భద్రత, ఏసీబీ విభాగాల్లో అదనపు డీజీగా విధులు నిర్వహిస్తున్నారు. అనిల్ కుమార్ గ్రేహౌండ్స్ విభాగంలో అదనపు డీజీగా ఉన్నారు. వీసీ సజ్జనార్ ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ పదోన్నతులతో పోలీసు శాఖలో పరిపాలన మరింత బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. అనుభవజ్ఞులైన అధికారులకు ఉన్నత హోదాలు ఇవ్వడం ద్వారా శాంతి భద్రతల నిర్వహణలో సమర్థత పెరుగుతుందని పేర్కొన్నారు. మొత్తానికి, ఈ పదోన్నతులు తెలంగాణ పోలీసు వ్యవస్థలో కీలక మార్పులకు దారి తీస్తూ, పరిపాలనా సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచనున్నాయి.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కాళేశ్వరం నివేదికపై స్టే

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశించిన సరైన ప్రక్రియను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పును వెలువరించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్.కె. జోషి, ప్రస్తుత ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ కింద తమకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయలేదని, తమ వాదనలు వినకుండానే కమిషన్ నివేదికను రూపొందించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని అంగీకరిస్తూనే, ప్రస్తుత నివేదిక ఆధారంగా పిటిషనర్లపై ఎటువంటి చర్యలు తీసుకోవడానికి వీల్లేదని తేల్చి చెప్పింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందింది. అయితే ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటిపై సమగ్ర విచారణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ సుదీర్ఘ విచారణ అనంతరం తన నివేదికను 2025 జులై 31న ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్టు వైఫల్యాలకు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తూ నివేదికలో పేర్కొంది.

పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ దామా శేషాద్రి నాయుడు తన వాదనలు వినిపిస్తూ, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఈ నివేదిక ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, కమిషన్ తరఫున సీనియర్ కౌన్సిల్ ఎస్. నిరంజన్ రెడ్డి తమ వాదనలు వినిపించినప్పటికీ ధర్మాసనం పిటిషనర్ల వాదనపై మొగ్గు చూపింది. నిందితులుగా పేర్కొంటున్న వ్యక్తులకు తమ వెర్షన్ చెప్పుకునే అవకాశం కల్పించకుండా ఏకపక్షంగా నివేదిక ఇవ్వడం చట్టబద్ధం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దీనివల్ల కమిషన్ నివేదికలోని అంశాల ఆధారంగా ప్రభుత్వం ముందుకెళ్లడం ప్రస్తుతానికి నిలిచిపోయింది.

హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. ప్రభుత్వం ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందా లేదా అనేది వేచి చూడాలి. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ అల్లుకున్న అవకతవకల ఆరోపణలపై ఒకవైపు విజిలెన్స్ విచారణ, మరోవైపు ఈ జ్యుడీషియల్ కమిషన్ విచారణ కొనసాగుతున్నాయి. ప్రస్తుత తీర్పుతో బీఆర్ఎస్ అగ్రనేతలకు పెద్ద ఊరట లభించినట్లయింది. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలపై రాజకీయ విమర్శలు ప్రతివిమర్శలు కొనసాగుతున్న తరుణంలో, న్యాయస్థానం సరైన ప్రక్రియ పాటించాలని స్పష్టం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వం తదుపరి అడుగులు ఎలా ఉంటాయనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

## కాళేశ్వరం నివేదికపై స్టే..
## అవినీతి అంశం మాత్రం మిగిలిందే : మహేశ్ గౌడ్

- హైకోర్టు తీర్పుపై టీపీసీసీ స్పందన
- సాంకేతిక కారణాలకే పరిమితమని స్పష్టం
- సీబీఐ విచారణపై బీజేపీపై ప్రశ్నలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు): కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా స్టే విధించిన నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ తీర్పు కేవలం సాంకేతిక అంశాలకే పరిమితమని, అవినీతి జరగలేదని కోర్టు ఎక్కడా చెప్పలేదని ఆయన స్పష్టం చేశారు. కమిషన్‌ను గానీ, దాని విచారణను గానీ కోర్టు తప్పుబట్టలేదని, నివేదిక రూపకల్పన విధానంపై మాత్రమే ప్రశ్నలు లేవనెత్తిందని వివరించారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందన్నది స్పష్టమని, బాధ్యులైన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనని పేర్కొన్నారు. ఈ అంశంపై దర్యాప్తు కొనసాగాల్సిన అవసరం ఉందని తెలిపారు.



గతంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాళేశ్వరంను "ఏటీఎం"తో పోల్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఈ అంశంపై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు.

బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయికారీ ఒప్పందం కారణంగానే ఈ కుంభకోణంపై కేంద్రం మౌనం పాటిస్తోందని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం అంశంలో నిజాలు వెలుగులోకి రావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొత్తానికి, హైకోర్టు స్టే తర్వాత కూడా కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం రాజకీయంగా మరింత వేడెక్కే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్టీసీ సమ్మె విరమించాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులు తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని, ప్రజా సంస్థను కాపాడుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మె ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ పరిశీలన చేస్తోందని, నాలుగు వారాల్లో నివేదిక వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి ఓ ప్రకటన విడుదల చేస్తూ సంస్థను, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు సమ్మెను విరమించుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామని, ఇది కాలయాపన చేసే వ్యూహం కాదని ఆయన భరోసా ఇచ్చారు. ఉద్యోగులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలపై ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని, వాటిని వెంటనే పరిష్కరించవచ్చని మంత్రి స్పష్టం చేశారు. మిగిలిన



ఆర్టీసీ విలీనం, యూనియన్ల గుర్తింపు వంటి అంశాలు సాంకేతిక పరమైనవని, వీటిపై లోతైన పరిశీలన అవసరమని ఆయన వివరించారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆర్టీసీ విలీనం ప్రక్రియ ఆలస్యమైనప్పటికీ ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, గత ప్రభుత్వాల హయాంలో ఉన్న పెండింగ్ సమస్యలను తమ ప్రభుత్వం వేగంగా పరిష్కరిస్తోందని గుర్తుచేశారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీతో పాటు బకాయిపడ్డ డీఏలను, 2013 నాటి బాండ్లను సైతం పరిష్కరించినట్లు తెలిపారు. రూ.1,205 కోట్లుగా ఉన్న పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు, రూ.690 కోట్లుగా ఉన్న సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామన్నారు. పీఎఫ్, సీసీఎస్ కోసం ప్రతినెలా రూ.75 కోట్లు చెల్లిస్తూ సంస్థను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని వివరించారు. ఉద్యోగుల భవిష్యత్తు నిధి విషయంలో ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని ఆయన పేర్కొన్నారు. పని భారం తగ్గించేందుకు త్వరలోనే 4,538 మంది ఉద్యోగుల నియామకాన్ని పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటికే 1,134 కారుణ్య నియామకాలు చేపట్టామని, గతంలో తొలగించిన 250 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రస్తుతం కోలుకుంటోందని, ఈ దశలో సమ్మె చేయడం సంస్థకు, ప్రజలకు నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీపై ఆధారపడి ఉన్నారని, వీరిలో 45 లక్షల మంది మహిళలేనని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న వేళ సమ్మె ప్రభావం వారిపై తీవ్రంగా పడుతుందన్నారు. పేద ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను భరించలేరని, కాబట్టి ప్రజా రవాణాకు ఆటంకం కలిగించకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, వారికి అండగా ఉంటుందని భరోసా ఇస్తూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వెంటనే విధుల్లో చేరాలని కోరారు. సమ్మె వల్ల సంస్థకు వచ్చే ఆదాయం దెబ్బతినడమే కాకుండా సామాన్యుల ఇబ్బందులు పెరుగుతాయని హెచ్చరించారు. అందరూ కలిసికట్టుగా సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలని, ప్రభుత్వంపై నమ్మకంతో సమ్మె విరమించాలని పొన్నం ప్రభాకర్ తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్ నుంచి 8 కొత్త వీక్లీ స్పెషల్ రైళ్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** రైల్వే ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ నుంచి వివిధ గమ్యస్థానాలకు 8 కొత్త వీక్లీ స్పెషల్ రైళ్లను ప్రకటించింది. ఈ నిర్ణయంతో ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలగనుంది.

కొత్తగా ప్రకటించిన రైళ్లలో కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి తిరుచానూరుకు గురువారం రాత్రి 9.30 గంటలకు బయలుదేరే రైలు మే 15 నుంచి ప్రారంభం కానుంది. అలాగే కాచిగూడ నుంచి శ్రీ గంగానగర్‌కు శనివారం రాత్రి 10 గంటలకు బయలుదేరే రైలు జూలై 14 నుంచి అందుబాటులోకి రానుంది. చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి తిరుచానూరుకు బుధవారం సాయంత్రం 6.55 గంటలకు, తిరుపతికి బుధవారం రాత్రి 9.20 గంటలకు, శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు, ఆదివారం రాత్రి 9.15 గంటలకు రైళ్లు నడవనున్నాయి. ఈ రైళ్లు మే నెలలోనే దశలవారీగా ప్రారంభం కానున్నాయి.

అదేవిధంగా చర్లపల్లి నుంచి భువనేశ్వర్‌కు సోమవారం సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరే రైలు మే 5 నుంచి అందుబాటులోకి రానుంది. నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి జైపూర్‌కు శుక్రవారం రాత్రి 7.50 గంటలకు బయలుదేరే మరో రైలు కూడా త్వరలో ప్రారంభం కానుంది.

ఈ కొత్త రైళ్ల ద్వారా దక్షిణ, ఉత్తర, తూర్పు ప్రాంతాల మధ్య రైలు సదుపాయం మరింత మెరుగుపడనుంది. ముఖ్యంగా యాత్రికులు, ఉద్యోగులు, విద్యార్థులకు ఈ రైళ్లు ఉపయోగకరంగా మారనున్నాయి. మొత్తానికి, హైదరాబాద్ నుంచి కొత్తగా ప్రకటించిన వీక్లీ స్పెషల్ రైళ్లు ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణానికి దోహదపడనున్నాయి.





## వంతెనలకు అప్రోచ్ రోడ్లపై ప్రభుత్వం దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

వెంకటరెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్ల క్రితం నిర్మించిన అనేక వంతెనలు ఇప్పటికీ అప్రోచ్ రోడ్లు లేక ప్రజలకు ఉపయోగపడకపోవడం పై డిప్యూటీ సీఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వ్యయంతో నిర్మించిన ఈ వంతెనలు ప్రజలకు ఉపయోగం లేకుండా నిలిచిపోవడం ప్రభుత్వ లక్ష్యాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

అప్రోచ్ రోడ్ల లేమి వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, రైతులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమావేశంలో ప్రస్తావించారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన రూ.148 కోట్ల నిధుల విడుదలకు క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపినట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. నిధుల విడుదలతో పాటు పనులు వేగంగా ప్రారంభమయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రతిపాదనల విషయంలో ఆలస్యం జరగకుండా అన్ని శాఖలు 1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు ఆర్థిక శాఖకు పంపాలని భట్టి విక్రమార్క తెలిపారు. ఆ ప్రతిపాదనలను సబ్ కమిటీలు తక్షణమే పరిశీలించి ఆమోదం తెలుపుతాయని చెప్పారు. సరైన ప్రణాళిక, సమయపాలనతో పని చేస్తే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తవుతాయని పేర్కొన్నారు.

మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు ఆలస్యం కాకుండా పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ పెంచి పనుల పురోగతిని సమయానుకూలంగా సమీక్షించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులను అమలు చేయాలని ఆదేశించారు.

మొత్తానికి, ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులకు కొత్త ఊపునిచ్చే అవకాశముందని భావిస్తున్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తయితే వంతెనలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చి ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుంది.

## 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టిన జూపల్లి

(మొదటి పేజీ తరువాయి)

ఈ 'రివర్స్ టూరిజం' ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. అడవి బిడ్డల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి, విద్య పట్ల ఆసక్తిని పెంచడానికి ఈ కార్యక్రమం ఒక వారధిలా ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ వినూత్న కార్యక్రమంలో భాగంగా అటవీ ప్రాంతాలకు చెందిన 250 మంది ఆదివాసీలతో కూడిన బృందం హైదరాబాద్ నగర సందర్శనకు బయలుదేరింది. ఈ యాత్రను ప్రారంభించిన అనంతరం మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించారు. ప్రయాణ సమయంలో ఆదివాసీ యువత, పెద్దలతో ముచ్చటించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం వెనుక ఉన్న ప్రభుత్వ లక్ష్యాలను వారికి వివరించారు. బాహ్య ప్రపంచం గురించి తెలుసుకోవడం వల్ల ఆదివాసీ పిల్లలు పెద్ద కలలు కంటారని, ఉన్నత విద్యావంతులుగా ఎదిగేందుకు స్ఫూర్తి పొందుతారని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రివర్స్ టూరిజం అనేది కేవలం ఒక యాత్ర మాత్రమే కాదని, ఇది వారసత్వానికి, ఆధునికతకు మధ్య నిర్మించిన ఒక వంతెన అని మంత్రి అభివర్ణించారు. ఆదివాసీల సాధికారత, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అవగాహన, విజ్ఞానం ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు. అటవీ సంపదను కాపాడుకుంటూనే, బయటి ప్రపంచంలో జరుగుతున్న మార్పులను గమనించడం వల్ల గిరిజన గూడాల్లో సామాజిక మార్పు వస్తుందని ఆయన నొక్కి చెప్పారు. నిజమైన పరివర్తన అనేది అవగాహన, విద్య ద్వారానే సాధ్యమవుతుందని తాము బలంగా నమ్ముతున్నట్లు మంత్రి తన సందేశంలో వెల్లడించారు.




రెండు రోజుల పాటు సాగే ఈ విజ్ఞాన యాత్రలో భాగంగా ఆదివాసీ బృందం హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాలను సందర్శించనుంది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, చారిత్రక చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రదేశాలను వారు సందర్శిస్తారు. విమానాశ్రయంలో విమానాల రాకపోకలు, నగరంలోని ఆధునిక కట్టడాలను చూడటం ద్వారా ఆదివాసీ విద్యార్థులకు సరికొత్త అనుభూతి లభిస్తుందని అధికారులు తెలిపారు. నగర సంస్కృతిని, గిరిజన సంప్రదాయాలను పరస్పరం గౌరవించుకునేలా ఈ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమం డిజైన్ చేయబడింది.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు మంత్రి జూపల్లి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రతి బిడ్డ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని ఆయన పునరుద్ఘాటించారు. ఆదివాసీల సంస్కృతిని కాపాడుతూనే వారిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మరిన్ని వినూత్న పథకాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అడవి బిడ్డల కళ్లలో మెరిసే ఉత్సాహమే ఈ పథకం విజయానికి నిదర్శనమని, భవిష్యత్తులో మరిన్ని బృందాలను ఇలాంటి యాత్రలకు పంపిస్తామని మంత్రి ప్రకటించారు. దీంతో ఉట్నూరు ప్రాంతంలోని ఆదివాసీ గూడాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# రైతులకు ఊరట- వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెద్దమందడి,ఏప్రిల్22(తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతులు తమ పంటను నేరుగా ప్రభుత్వానికి విక్రయించే అవకాశాన్ని కల్పించడం ద్వారా మధ్యవర్తుల సమస్యలు తొలగి, న్యాయమైన ధర లభిస్తుందని తెలిపారు.రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.వరి కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సకాలంలో పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించవచ్చని హామీ ఇచ్చారు.మహిళా సమాఖ్యల ద్వారా కేంద్రాల నిర్వహణ గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, వ్యవసాయ రంగానికి మద్దతు అందిస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.





## రైతుల నీటి సమస్యలపై ప్రణవ్ దృష్టి

- కల్వల ప్రాజెక్ట్ పూర్తి చేయాలని విజ్ఞప్తి

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** వీణవంక, జమ్మికుంట మండలాల రైతులకు సాగునీరు అందించే కీలకమైన కల్వల ప్రాజెక్ట్ పనులను వేగంగా పూర్తి చేయాలని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ పట్టుదలగా ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని సచివాలయంలోని వారి ఛాంబర్‌లో కలిసి సమస్యలను వివరించారు. ప్రాంత రైతుల ఇబ్బందులను ప్రస్తావిస్తూ, సాగునీటి కొరత వల్ల పంటలు దెబ్బతింటున్నాయని ప్రణవ్ ఆవేదన వ్యక్తం చేశారు. కల్వల ప్రాజెక్ట్ పూర్తయితే వేలాది ఎకరాలకు నీరు అంది రైతులకు భారీ ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈ మేరకు మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే గుంపుల-శంభునిపల్లి గ్రామాల పరిధిలోని తనుగుల చెక్ డ్యాం పునరుద్ధరణను కూడా తక్షణమే చేపట్టాలని కోరారు. ఈ చెక్ డ్యాం పునరుద్ధరణతో భూగర్భ జలాలు పెరిగి, సాగునీటి సమస్యలు తగ్గుతాయని వివరించారు.
ప్రణవ్ విజ్ఞప్తికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనాల కోసం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

# బడి బాటతో ప్రభుత్వ విద్యకు కొత్త ఊపిరి

ఎల్కతుర్తి, ఏప్రిల్ 22 ( తెలంగాణ ముచ్చట్లు):

ఎల్కతుర్తి మండలం భావుపేటలో బుధవారం "ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట" కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భావుపేట, దండేపల్లి పాఠశాలల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెండా ఊపి ప్రారంభించారు.
ఈ సందర్భంగా బావుపేట స్కూల్ కాంప్లెక్స్ హెచ్.ఎం ఎల్. మనోహర్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా ఇంగ్లీష్ మీడియంలో సులభంగా అర్థమయ్యే విధంగా ప్రత్యేక బోధన అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, రెండు జతల యూనిఫాంలు, పౌష్టికాహారం అందిస్తున్నామని వివరించారు.
ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్న తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో బడి బాట ర్యాలీ నిర్వహించి విద్య ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరయ్య చారి, ఉపాధ్యాయులు ముకుంద రెడ్డి, శ్రీధర్, ఎం. రవి కుమార్, పబ్బు రాజు, అనిత, శారద, ప్రభ, సునీత, రాధిక, పీఈటీ సుధాకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.కార్యక్రమం చివర్లో విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.






## ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు దేవేందర్‌కు ఘన సన్మానం

పెద్దమందడి,ఏప్రిల్22(తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న జీవశాస్త్ర పాఠశాల ఉపాధ్యాయుడు దేవేందర్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎస్ వరప్రసాద్ రావు, పెద్దమందడి మండల విద్యాధికారి మంజులత పాల్గొన్నారు.అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాణం విష్ణు, ఉపాధ్యాయులు వెంకటనారాయణ, రమేష్, మునీరుద్దీన్, శ్రీనివాసులు, మల్లయ్య, కళ్యాణి, రవి కుమార్, గోపాల్, ప్రశాంతి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా హైదరాబాద్ ఏజీ ఆఫీస్ నుండి వచ్చిన పెన్షన్, కమ్యూటేషన్, గ్రాట్యుటీ మంజూరు పత్రాన్ని దేవేందర్‌కు అందజేశారు.కార్యక్రమంలో పాల్గొన్నవారు దేవేందర్ సేవలను ప్రశంసిస్తూ, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# యాతాలకుంట టన్నెల్ పనులు వేగవంతం చేయాలి

- మంత్రి తుమ్మల ఆదేశం

సత్తుపల్లి, ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):

సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగమైన యాతాలకుంట టన్నెల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సత్తుపల్లి మండలంలో పనులను పరిశీలించిన మంత్రి, జిల్లా కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, అంకిత్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. మొత్తం 1.78 కి.మీ. పొడవున్న టన్నెల్‌లో చివరి 30 మీటర్ల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గోదావరి వరదలకుముందే ఎగువ నిర్మాణ పనులు పూర్తిచేయాలని సూచించారు. సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా 43 కి.మీ. పొడవున 1.46 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రూ.700 కోట్ల అంచనాతో చేపట్టిన ప్రాజెక్టులో ఇప్పటికే రూ.600 కోట్ల పనులు పూర్తయ్యాయని చెప్పారు. భూసేకరణ, కోర్టు సమస్యలతో పనులు ఆలస్యం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, చిన్న కారణాలతో పనులు నిలిపివేయవద్దని అధికారులను హెచ్చరించారు. అవసరమైతే అదనపు సిబ్బందితో రాత్రింబవళ్లు పనిచేసి ఈ సీజన్‌లోనే నీరు అందించాలని ఆదేశించారు. రాజీవ్ కాలువ ద్వారా ఇప్పటికే 1.35 లక్షల ఎకరాలకు నీరు అందుతున్నదని, ఈ ఏడాది వైరా ఆయకట్టు సహా పలు మండలాలకు గోదావరి జలాలను మళ్లించే అవకాశముందని మంత్రి తెలిపారు. ట్రంక్ కాలువ పూర్తైతే వేంసూరు, దమ్మపేట ప్రాంతాలకు కూడా సాగునీరు అందుతుందని చెప్పారు. ప్రాజెక్ట్ పూర్తి ద్వారా ఉమ్మడి జిల్లాల్లో 8 నియోజకవర్గాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# విజయగిరిలో ఘనంగా హిందూ సమ్మేళనం

జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జమ్మికుంట ఖండ ఆధ్వర్యంలో విజయగిరి ఉపమండలంలోని నాగంపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం హిందూ ధర్మ సమ్మేళనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తి, ఉత్సాహ వాతావరణంలో సాగి గ్రామంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించింది.
ఈ కార్యక్రమానికి స్వామీజీ ఎస్పీ వెంకటాచార్యులు, వివేకానంద కేంద్ర కార్యకర్త గుండా సుధా శ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హిందూ ధర్మం విశిష్టత, కుటుంబ విలువలు, సంప్రదాయాల గొప్పతనం గురించి వారు విశదీకరించారు. "ప్రపంచంలో కెల్లా హిందూ ధర్మమే గొప్పది" అని ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ కార్యవాహ పాక సత్యనారాయణ పేర్కొన్నారు.
"శ్రీరామ జయరామ జయ జయ రామ", "రామలక్ష్మి జానకి జై బోలో హనుమాన్ కి" వంటి నినాదాలతో గ్రామం మారుమోగింది. కార్యక్రమం భక్తి పారవశ్యంలో సాగి పాల్గొన్నవారిలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో మద్దూరి జగదీశ్వర్, నరసింహారెడ్డి, సర్పంచ్ కప్పల పోశెట్టి, తోడేటి శ్రీనివాస్, బాపూరావు, కుమారస్వామి, ఉపసర్పంచ్ వెంగళ సుమలత-లింగమూర్తి, ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ దాసరి రవీందర్, ఎక్కడి రఘుతం రెడ్డి, ఆకుల రాజేందర్, సంపెల్లి సంపత్ రావు, టంగుటూరి రాజ్‌కుమార్, పొట్టల మల్లేష్, తిరుపతి, పాకల రవీందర్ రెడ్డి, పొన్నగంటి రవికుమార్, దయ్యాల ప్రభాకర్, కామ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






## ఇల్లు కోల్పోయిన నిరుపేద కుటుంబానికి సహాయం చేసిన సరోజ్ రెడ్డి

అడ్డాకల్,ఏప్రిల్22(తెలంగాణ ముచ్చట్లు):

మహబూబ్ నగర్ అడ్డాకుల మండలంలోని బలిదుపల్లి గ్రామానికి చెందిన మందడి నారమ్మ నివాస గృహం పైకప్పు గాలి, వానలకు కూలిపోవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇంటిలో పెద్దమ్మతో పాటు ఆమె కుమార్తె, మనవరాళ్లు మాత్రమే ఉండడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి వెంటనే స్పందించి, ఆ ఇంటికి తాత్కాలికంగా పైకప్పు ఏర్పాటు చేసుకునేందుకు పాలిథిన్ కవర్‌ను అందజేశారు. అలాగే ఆ కుటుంబానికి తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.సహాయం అందించినందుకు నారమ్మ కుటుంబ సభ్యులు సరోజ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గణేష్, మండల నాయకులు ఆంజనేయులు, కార్యకర్తలు వై ఆంజనేయులు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ సౌందర్యానికి కొత్త ఛాయలు

- చైర్మన్ ప్రత్యక్షంగా పనుల సమీక్ష

జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):

జమ్మికుంట పట్టణాన్ని మరింత ఆకర్షణీయంగా, అందంగా తీర్చిదిద్దే దిశగా చేపట్టిన కూడళ్ల సుందరీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ స్వయంగా పరిశీలించి, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులను సమగ్రంగా పరిశీలించిన ఆయన, రోడ్ల వెంట పచ్చదనం, లైటింగ్, అలంకరణ ఏర్పాట్లు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేలా ఉండాలని అధికారులకు సూచించారు. "జమ్మికుంటకు వచ్చే ప్రతి ఒక్కరికీ మంచి అనుభూతి కలిగేలా పట్టణాన్ని తీర్చిదిద్దాలి" అని ఆయన పేర్కొన్నారు.
ఈ సుందరీకరణ పనులు పూర్తయితే జమ్మికుంటకు ప్రత్యేక గుర్తింపు లభించడమే కాకుండా, పట్టణ సౌందర్యం మరింత మెరుగవుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యం, పట్టణ అభివృద్ధి రెండింటినీ దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హుజురాబాద్ సమస్యలపై సెక్రటేరియట్‌లో చర్చ

■ సొల్లు బాబు, మంత్రి భేటీ



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ సెక్రటేరియట్‌లో బొగ్గు గనుల శాఖ మరియు కార్మిక శాఖ మంత్రివర్యులు డాక్టర్ గడ్డం వివేకానంద వెంకట స్వామిని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సొల్లు బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ పరిధిలో కొనసాగుతున్న డంపింగ్ యార్డ్ నిరసనల విషయాలను మంత్రికి వివరించారు.
ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆందోళనలపై సొల్లు బాబు వివరంగా తెలియజేయగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రికి తెలియజేసి తగిన చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు.
ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాము నిరంతరం కృషి చేస్తామని సొల్లు బాబు తెలిపారు.



# హుజురాబాద్ ఆర్టీసీ డిపోలో ఉద్రిక్త వాతావరణం

■ కార్మికుల నిరసన ఉధృతం

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ ఆర్టీసీ డిపో వద్ద బుధవారం కార్మికుల సమ్మె తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. సమ్మె నేపథ్యంలో డిపో నుంచి ప్రైవేట్ బస్సులను బయటకు పంపేందుకు అధికారులు ప్రయత్నించగా, ఆర్టీసీ కార్మికులు తీవ్రంగా అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ డిపో ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.
"ప్రైవేటీకరణకు వీల్లేదు... మా హక్కులు కాపాడాలి" అంటూ కార్మికులు గట్టిగా నినాదాలు చేయడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన పోలీసులు అక్కడికి చేరుకుని కార్మికులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు.
ఈ క్రమంలో కార్మికులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని తోపులాటకు దారి తీసింది. కొంతసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, పోలీసులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.
సమ్మె కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కార్మిక సంఘాలు తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేయడంతో పరిస్థితి మరింత ఉత్కంఠభరితంగా మారింది.



# ఉపాధి పనుల వద్ద కార్మికులకు సదుపాయాలు

- ఎండ వేడిలో టెంట్ హౌస్ ఏర్పాటు.
- కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ.
- సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్.

**సత్తుపల్లి, ఏప్రిల్ 22(తెలంగాణ ముచ్చట్లు):** బేతుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న పనుల వద్ద కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పనిస్థలంలో టెంట్ హౌస్ ఏర్పాటు చేసి కార్మికులకు విశ్రాంతి కోసం అనుకూల వాతావరణాన్ని కల్పించారు. అదేవిధంగా, కార్మికుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు చల్లని తాగునీటి క్యాన్లు అందుబాటులో ఉంచడంతో పాటు, డీహైడ్రేషన్ నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ చర్యలు కార్మికులలో ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా, వారి ఆరోగ్య భద్రతపై గ్రామ పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు స్పష్టమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పనులు సక్రమంగా సాగుతాయని, ఎండల ప్రభావం నుంచి వారిని కాపాడటం తమ బాధ్యత అని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ మద్దతు

■ సత్తుపల్లి డిపో ఎదుట బస్సుల రాకపోకలు నిలిపివేత.

**సత్తుపల్లి, ఏప్రిల్ 22(తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రవ్యాప్తంగా తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు బుధవారం సమ్మె బాట పట్టారు. ఇందులో భాగంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఎదుట బుధవారం ఉదయం నుంచే బస్సుల రాకపోకలను నిలిపివేసి కార్మికులు విధులను బహిష్కరించారు. ఈ సమ్మెకు సత్తుపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షుడు బానోతు విజయ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పాల నాగాసురేందర్ రెడ్డి, జిల్లా మండలి సభ్యుడు ఆచంట నాగస్వామి మాట్లాడుతూ, గతంలో ఆర్టీసీ కార్మికులు 54 రోజుల పాటు నిరవధిక సమ్మె నిర్వహించినప్పటికీ అప్పటి ప్రభుత్వం వారి డిమాండ్లను పరిశీలిస్తామని చెప్పి సమ్మెను విరమింపజేసిందని తెలిపారు. అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు ఒక్క డిమాండ్ కూడా అమలు కాలేదని, కార్మికుల సమస్యలను పక్కనబెట్టి సంఘాలను బలహీనపరిచారని విమర్శించారు. 2017 నుంచి చెల్లించాల్సిన బకాయిలు ఇంకా చెల్లించలేదని, 2021 మరియు 2025 వేతన సవరణలు అమలు కాలేదని పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా మార్చడం వంటి డిమాండ్లు ఇంకా పరిష్కారం కాలేదని తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగించాలని పిలుపునిచ్చారు. బీజేపీ పార్టీ కార్మికుల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మందా శివ, సీనియర్ నాయకులు చీకటి వసంతరావు, పెద్దిరాజు, బట్టి శివ, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు

■ ఈ-వ్యర్థాల సేకరణ, పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత

**సత్తుపల్లి, ఏప్రిల్ 22(తెలంగాణ ముచ్చట్లు):**

సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చేపట్టిన పర్యావరణ వారోత్సవం కార్యక్రమాలు సత్తుపల్లిలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సత్తుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి స్థానిక ప్రజల ప్రశంసలు అందుకున్నారు. పట్టణంలోని బస్టాండ్ కేంద్రంలో వాడుకలో లేని ఎలక్ట్రానిక్ పరికరాల ఈవ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణానికి హానికరమైన ఈవ్యర్థాలను సరైన విధంగా నిర్వహించడం అవసరమని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించినట్లు తెలిపారు. అలాగే వైరా కంటి వైద్య ఆసుపత్రి సహకారంతో దుద్దిపూడి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సూచనలు అందించారు. అదనంగా మధుమేహ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరీక్షించారు. డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ శ్యాంబాబు సేవలు అందించారు. ఇదే సందర్భంలో చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి ప్రభుత్వ పాఠశాలకు సుమారు రూ.18 వేల విలువైన సౌండ్ సిస్టంను అందజేశారు. తుంబూరు సుభాషిణి, నాగిరెడ్డి సహకారంతో ఈ సౌండ్ సిస్టంను అందించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేసి వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ విస్తరణ విభాగ బాధ్యులు మందపాటి ప్రభాకర్ రెడ్డి, సత్తుపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోగడ రమేష్, చల్లగుండ్ల అప్పారావు, గండ్ర సోమిరెడ్డి, జయ, సిద్ధిపూడి సర్పంచ్ అనసూర్య, మొరంపూడి శ్రీధర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.







# డంపింగ్ యార్డ్‌పై హోరాహోరీ పోరాటం

■ అరెస్టులతో కొత్త మలుపు

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్, వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్ట్‌లపై ప్రజల ఆగ్రహం అగ్గిపుల్లలా రగులుతోంది. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిర్వహించిన భారీ నిరసనలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముందుండి నిరసనలో పాల్గొనగా, పోలీసులు ఆయనను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతను మరింత పెంచింది.
అరెస్టుల నేపథ్యంలో నాయకులు తీవ్రంగా స్పందిస్తూ, "ప్రజల హక్కుల కోసం చేస్తున్న పోరాటాన్ని ఎవరూ అణచలేరు... అరెస్టులతో భయపడేది లేదు" అని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డ్, వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్ట్‌లను రద్దు చేయకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
ఇదిలా ఉండగా, సిర్సపల్లి గ్రామ శివారులో ప్రతిపాదించిన వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా అఖిలపక్ష ఐక్య పోరాట కమిటీ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా కొనసాగుతున్న నిరసన దీక్షలు ప్రజల్లో చైతన్యం రగిలిస్తున్నాయి. బుధవారం నిర్వహించిన దీక్షలో పెన్షనర్లు, బీసీ సంఘాలు, సామాజిక సంస్థలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఐక్యతను చాటాయి. ఈ సందర్భంగా నాయకులు గంభీర హెచ్చరికలు జారీ చేస్తూ, "చెత్త కాల్చే ప్రక్రియలో వెలువడే విషవాయువులు గాలిని విషపూరితం చేస్తాయి... భూమిలోకి చేరే రసాయనాలు నీటిని కలుషితం చేసి పంటలను నాశనం చేస్తాయి" అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే ఈ ప్రాజెక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే జనావాసాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు. "ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల స్వరాన్ని వినాలి... లేదంటే ఈ ఉద్యమం మరింత పెద్దదిగా మారుతుంది" అని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి గట్టి మద్దతు ప్రకటించారు. హుజురాబాద్‌లో ఈ పోరాటం మరింత ఉధృతం కానుందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# పార్టీ కోసం శ్రమించిన వారికే పదవులు

■ మహంకాళి స్వామి స్పష్టం

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 22 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కొత్తపల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్పర్సన్ దేశిని స్వప్న కోటి స్వగృహానికి రామగుండం కార్పొరేషన్ చైర్మన్ మహంకాళి స్వామి విచ్చేయగా, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా మహంకాళి స్వామి మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే ఎన్ఎస్‌యూఐ, యువ కాంగ్రెస్ ద్వారా పార్టీతో తన అనుబంధం కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన నాయకులతో అప్పటి నుంచే స్నేహ సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో నామినేట్ పదవుల్లో కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు తప్పకుండా ప్రాధాన్యం కల్పిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.
జిల్లా స్థాయి నాయకత్వం, ముఖ్యంగా బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ సహకారంతో కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తాను కూడా ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో దేశిని కోటి, సుంకరి రమేష్, సాయిని రవి, ముద్దమల్ల రవి, బొంగోని వీరన్న, రామ్ రెడ్డి, అజయ్ రామ్మూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు మాచర్ల రాజు, ఇంగిత అశోక్, యాట్ల సునీత అశోక్, కాంగ్రెస్ నాయకులు పొన్నగంటి మధు, నాగేంద్ర, రమేష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సెపక్ తక్రా జాతీయ జట్టు కోచ్ గా పోరిక అనిల్ కుమార్



**హన్మకొండ,ఏప్రిల్22(తెలంగాణ ముచ్చట్లు):**

